

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం

12 నవంబర్ 2025 పేజీలు : 08




## నెల్లూరు ఎన్టీఆర్ నగర్ హైవేపై..

# ఘోర రోడ్డు ప్రమాదం

నెల్లూరులోని ఎన్టీఆర్ నగర్ హైవేపై మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. చేపల లోడుతో చెన్నై నుంచి కావలి వైపు జాతీయ రహదారిపై వెళుతున్న లారీ ఆకస్మాత్తుగా అదుపు తప్పి ముందు వెళ్తున్న వాహనాలను ఢీ కొట్టుకుంటూ.. రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపారస్తులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :

స్థానికుల సమాచారం ప్రకారం లారీ వేగంగా వస్తూ.. ముందు వెళ్తున్న టాటా ఏస్ వాహనంను ఢీకొట్టింది. అదుపుతప్పి పక్కనే ఉన్న మూడు మోటార్ బైకులను దాటుకుంటూ దూసుకెళ్లింది. ఢీకొన్న బైకులపై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. లారీ చివరికి రోడ్డు పక్కన ఉన్న

-మిగతా 2లో

- ముగ్గురు మృతి.. పలువురికి గాయాలు
- 108 సాయంతో గాయపడిన వారిని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలింపు
- ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు







## జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు
# అపారమైన అవకాశాలు


- పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నాం
- రామదాసుకండ్రిగలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుతో యువతకు ఉద్యోగాలు
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
- డిసెంబరు లేదా జనవరిలో జిల్లాస్థాయి పరిశ్రమల సదస్సు

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అపారమైన అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు.

వివరాలు 2లో



# 24×7 మద్యం లభ్యం



02 పేజీలో

- ప్రతి క్వార్టర్‌పై అదనంగా రూ.50 వసూలు
- ఎనీటైం.. రాపూరులో బెల్టు షాపులల్లో మద్యం లభించును
- కన్నెత్తి చూడని పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు
- అధికారులు మామూళ్లు తీసుకుంటున్నారని ప్రజల ఆరోపణలు

# జిల్లాలో విస్తృత తనిఖీలు

ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

స్వయంగా తనిఖీలను పరిశీలిస్తున్న ఎస్పి డా.అజిత




8లో..

ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటన నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఎస్పీ పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

# ర్యాలీలు
## విజయవంతం చేయండి

**కాకాణి గోవర్ధనరెడ్డి**



కూటమి ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సాధించిన 17 మెడికల్ కళాశాలలో 10 మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసి, వైద్య విద్యను దూరం చేయడంతో పాటు, పేదలకు వైద్యం కూడా దూరం చేయాలనే దుర్బుద్ధితో వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే.

వివరాలు 02లో

# జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అపారమైన అవకాశాలు

- పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నాం
- రామదాసుకండ్రిగలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుతో యువతకు ఉద్యోగాలు
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
- డిసెంబరు లేదా జనవరిలో జిల్లాస్థాయి పరిశ్రమల సదస్సు




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అపారమైన అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి సీఎం చంద్రబాబునాయుడు శ్రీ పొట్టిశ్రీ రాములు నెల్లూరు జిల్లాలోని సర్వేపల్లి బిట్-2 రామదాసుకండ్రిగ వద్ద ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కు (పారిశ్రామికవాడ)కు, మర్రిపాడు మండలం పొంగూరు వద్ద ఏర్పాటు చేయనున్న స్నేహ ఫామ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు భూమిపూజ, శిలాఫలకాలను వర్చువల్‌గా ఆవిష్కరించారు. కార్యక్రమానికి నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, పలువురు పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్వేపల్లి బిట్-2 రామదాసుకండ్రిగలో 57.50 ఎకరాలలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు సీఎం చంద్రబాబునాయుడు వర్చువల్‌గా శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. మొదటివిడత 20 ఎకరాల్లో 5.50 కోట్లతో ఈ పార్కులో రోడ్లు, విద్యుత్, నీరు వంటి మౌలిక వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. ఈ పార్కు వలన సుమారు ఐదువేల మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. కృష్ణపోర్టు, రామాయపట్నం పోర్టు, జాతీయ రహదారులు వంటి అపారమైన అవకాశాలతో పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన వాతావరణం జిల్లాలో ఉందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని కంటేపల్లిలో 220 ఎకరాలు, బండేపల్లి, మడమనూరులో 150 ఎకరాల ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ప్రోత్సాహాలు అందిస్తూ, సింగిల్‌విండో విధానం అన్ని అనుమతులు సకాలంలో మంజూరు చేసేలా సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కృష్ణపట్నం పోర్టుకు సమీపంలో గతంలో సేకరించిన 2600 ఎకరాల భూమి ఖాళీగా వుందని, సీఎం దృష్టికి తీసుకెళ్లి ఈ భూములను కూడా పరిశ్రమల ఏర్పాటుకు వినియోగించేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టరు హిమాన్షు శుక్ల మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వం లక్ష్యం కాగా, జిల్లాలో ఇప్పటికే 4 ఎంఎస్ఎంఈ పార్కులు ప్రారంభం కాగా, తాజాగా సర్వేపల్లిలో మరో ఎంఎస్ఎంఈ పార్కుకు సీఎం శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. రామాయపట్నం పోర్టు సమీపంలో త్వరలో అతిపెద్ద పరిశ్రమ బిపిసిఎల్ పెట్రోలియం రిఫైనరీ ఏర్పాటుకు భూమిపూజ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ భారీ పరిశ్రమకు అనుబంధంగా అనేక పరిశ్రమలు ఏర్పాటుకానున్నట్లు చెప్పారు. అలాగే ఎంఎస్ఎంఈ పార్కుల్లో మౌలిక వసతులను కల్పిస్తూ చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుతోనే యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. జిల్లాస్థాయిలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై డిసెంబరు లేదా జనవరిలో పారిశ్రామికవేత్తలతో జిల్లాస్థాయి పరిశ్రమల సదస్సును నిర్వహిస్తామని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని అనుమతులను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా పారదర్శకంగా మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. పారిశ్రామిక వేత్తలందరూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలని, ప్రభుత్వం తరపున అన్నివిధాల పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో ఎపిఐఐసి జోనల్ మేనేజర్ శివకుమార్, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## ర్యాలీలు విజయవంతం చేయండి

### కాకాణి గోవర్ధనరెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సాధించిన 17 మెడికల్ కళాశాలలో 10 మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసి, వైద్య విద్యను దూరం చేయడంతో పాటు, పేదలకు వైద్యం కూడా దూరం చేయాలనే దుర్బుద్ధితో వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం చేపట్టిన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా.. మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు నెల్లూరు జిల్లాలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంతో పాటు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించడం జరిగిందని జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు, కందుకూరు నియోజకవర్గంతో సహా అన్ని నియోజకవర్గాలలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి భారీ స్పందన రావడం, పెద్ద ఎత్తున ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని, మద్దతు ఇస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశాలలో రాజకీయాలకతీతంగా, పార్టీలకతీతంగా పాల్గొని అమూల్యమైన సందేశాన్ని అందించి, ప్రజలకు అవగాహన కల్పించి, ప్రైవేటీకరణపై ఉద్యమ పోరు ఉవ్వెత్తున ఎగిసేలా సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వపు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు ఉద్యమ పోరు మరింత ఉధృతం చేసేందుకు బుధవారం ఉదయం ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, కందుకూరు నియోజకవర్గంతో సహా 11 నియోజకవర్గాలల్లో చేపట్టనున్న "వైయస్సార్సీపీ ప్రజా ఉద్యమం" ర్యాలీలలో వైయస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాల నాయకులు, పౌర హక్కుల సంఘాల నాయకులు, మేధావులు, విద్యావేత్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేసి ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తెచ్చేం దుకు అందరి సహాయ సహకారాలు కొనసాగించాల్సిందిగా కోరారు.

## 24X7 మద్యం లభ్యం



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు అధికార పార్టీ నాయకుల అండతో మద్యంప్రియుల రక్తంను బెల్టుషాప్ నిర్వాహకులు పీల్చుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రాపూరు పట్టణంలో ఉన్న బ్రాందీ షాపు చుట్టుప్రక్కల సమీప ప్రాంతాల్లో ఎక్కడబడితే అక్కడ 24×7 అక్రమంగా మద్యం అందుబాటులో ఉంటుంది. క్వాటర్ బాటిల్‌పై 50 రూపాయలు అధికంగా వసూలు చేస్తున్నారు. ఈ తతంగమంతా స్థానిక ఎక్సైజ్ శాఖ అధికారులు, పోలీసు అధికారులకు తెలిసే జరుగుతుందని ఆరోపణలు వినపడుతున్నాయి. కూల్‌డ్రింక్ షాపులు పేరుతో దుకాణాలు ఏర్పాటు చేసి నిరంతరాయంగా అక్రమంగా మద్యం విక్రయాలు జోరుగా చేస్తున్నారు. అదే దుకాణాల్లో తాగడం కూడా చేపడుతున్నారు. తెల్లవారుజామునైనా, ఉదయం అయినా, మధ్యాహ్నం అయినా, సాయంత్రమైనా, అర్ధరాత్రి అయినా, ఏ గంటలో కావాలంటే ఆ గంటలో అన్ని రకాల మద్యాన్ని అక్రమంగా విక్రయాలు చేస్తున్నారు. ఈ బెల్టుషాపులు నిర్వహణలో రాపూరు మండలానికి సంబంధించిన అధికార పార్టీ నాయకులు కీలక పాత్ర పోషిస్తున్నారనే పుకార్లు బలంగా వినిపిస్తున్నాయి. ఎందుకంటే అధికార పార్టీ నాయకులే మద్యం దుకాణాల యజమానులు కాబట్టి. అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాల్సిన పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే ఎటువంటి కూలి పనులు లేక కరువు కాటకాలతో అల్లాడుతున్న తమ జీవన విధానంపై ఈ బెల్టుషాపుల ప్రభావం తీవ్రమవుతున్న నేపథ్యంలో కుటుంబాలు నాశనం అవుతున్నాయని మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరకొర పనులు చేసుకుని వచ్చిన సంపాదన బెల్ట్ షాపులకు తమ మగవారు ధారబోస్తున్నారని, తద్వారా కుటుంబాలు గడవక జీవన విధానం కుదేలవుతుందని పలువురు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు అక్రమ బెల్ట్ షాపుల నిర్వాహకుల నుండి నెలసరి మామూళ్లు తీసుకుని.. పట్టణంలో వీధి వీధిలో పుట్టగొడుగుల్లా ఏర్పాటై ఉన్న బెల్టుషాపులను అరికట్టలేకపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాపూరు పట్టణంలో ఏ చిన్న పిల్లల్ని అడిగినా కూడా బెల్ట్‌షాపు ఎక్కడ ఉందనగానే ఠక్కున చూపిస్తారని మహిళలు విమర్శలు చేస్తున్నారు. కనీసం రాపూరులో అక్రమంగా నిర్వహిస్తున్న ఒక్క బెల్ట్‌షాప్‌పైన కేసు నమోదు చేశారా ? అని స్థానిక మహిళలు అధికారులను నిలదీస్తున్నారు. ఇకనైనా మండల శాఖ అధికారులు, సంబంధిత శాఖ అధికారులు స్పందించి బెల్ట్ షాపులను నిలువరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. మండలంలోని గ్రామాలకు బహిరంగంగా బ్రాందీ షాపుల నుండి దర్జాగా ఆటోల్లో మద్యం కేసులు తరలిస్తున్నారు. ఎన్నికల సమయాల్లో బెల్ట్ షాపులు పూర్తిగా రద్దు చేస్తామని మహిళలకు మాట ఇచ్చి ఓట్లు వేయించుకున్న అధికార పార్టీ నాయకులు, ఇప్పుడు అక్రమ బెల్ట్ షాపులపై ఏమి సమాధానం చెబుతారని మహిళలు ప్రశ్నిస్తున్నారు.

## నెల్లూరు ఎన్టీఆర్ నగర్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం

*(మొదటి పేజీ తరువాయి)*

చెట్టును ఢీకొని ఆగిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని బయటకు తీశారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని 108 అంబులెన్స్‌ల సహాయంతో బాధితులను సమీపంలోని నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన నలుగురిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. లారీ డ్రైవర్ వేగం అధికంగా ఉండటమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతుల వివరాలు ఇంకా పూర్తిగా అందుబాటులో లేవని, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తున్నట్లు నార్త్ జోన్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలియజేశారు.

### స్థానికుల ఆవేదన..

ఈ ప్రాంతంలో తరచుగా ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. హైవేపై వేగ నియంత్రణ చర్యలు తీసుకోవాలని, స్పీడ్ బ్రేకర్లు, సిగ్నల్ బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే రోడ్డు భద్రత చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### మంత్రి నారాయణ దిగ్భ్రాంతి



ఎన్టీఆర్ నగర్ వద్ద హైవేపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడంపై రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నారాయణ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రోడ్డు ప్రమాదం వార్త వినగానే తనను తీవ్రంగా కలిచివేసిందంటూ మంత్రి విచారం వ్యక్తం చేశారు. గాయాలపాలైనవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారు లకు సూచించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా యంత్రాంగానికి మంత్రి నారాయణ ఆదేశించారు.

### రోడ్డు ప్రమాదంపై ఎమ్మెల్యే సోమిరెడ్డి దిగ్భ్రాంతి

నెల్లూరు వద్ద హైవేపై ఘోర ప్రమాదం జరిగి పలువురు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ఎమ్మెల్యే సోమిరెడ్డి పేర్కొన్నారు. మృతులు పెద్ద చెరుకూసిరి గార్డెన్స్ వాసులుకావడం, వారిలో తండ్రికొడుకులు ఉండటం మరింత బాధాకరమన్నారు. మొక్కజొన్న కంకులు అమ్ముకునే వారితోపాటు వాటిని కొనుగోలు చేసేందుకు వచ్చినవారిపై లారీ దూసుకెళ్లడం దురదృష్టకరమన్నారు. ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రమాదంలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, తీవ్రగాయాలపాలైన వారు క్షేమంగా కోలుకోవాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నామని తెలిపారు.

# ఆత్మకూరులో రైతులకు యూరియాకొరత

- మహిమలూరుకు సరఫరా నిల్
- ప్రవేటు వ్యాపారుల ఇష్టారాజ్యం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో యూరియాకొరతతో రైతులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. సాధారణంగా ప్రస్తుతం రబీసీజన్ ఇపుడిపుడే ప్రారంభమవుతున్నందున వరినార్లుమాత్రమే పోస్తున్నారు. నార్లకయితే తక్కువ యూరియా సరిపోతుంది. కానీ యూరియా డిమాండ్‌ను బట్టి రైతులు పంటకు సరిపడా యూరియాను సమకూర్చుకొని నిల్వచేసేందుకు సిద్దమయ్యారు. దాంతో కొరత తీవ్రంగా కన్పిస్తోంది. అదీగాక ప్రభుత్వం రైతులకు యూరియా సరఫరా ఒకరాకు 3బస్తాలు అంచెలంచెలుగా ఇచ్చే విధానం అమలు చేస్తుండగా రైతులు అందుకు సమ్మతిగా లేరు. యూరియా కొరత అంటూ రైతులు గగ్గోలుపెడుతుండగా స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నిరంతరం అధికారులతో చర్చిస్తూ యూరియాను రైతులకు సరిపడా పంపాలని ఆదేశిస్తున్నారు. కానీ అధికారులు కార్డు విధానం, ప్రస్తుతానికి ఎకరాకు ఒక బస్తా అంటున్నారు. రైతులు మాత్రం వరిపైరు సాగుచేస్తే తమ పొలాలు దూరంగా ఉన్నందున దారి లేక ఇబ్బందిపడగలమని, ఇపుడే తగినంతగా యూరియాను పొలాల్లో నిల్వ చేసుకోవాల్సి ఉందంటున్నారు. అదీగాక అధికారులు చెప్పినట్లుగా ఎకరాకు 3బస్తాలు చాలవని, తమ విధానం ప్రకారం అధికంగా వేస్తుంటామని కూడా చెబుతున్నారు. ప్రభుత్వం సొసైటీలద్వారా, ఆర్ఎస్‌కెల ద్వారా యూరియాను సరఫరాచేసేలా కొన్ని లారీలను పంపుతున్నారు. జిల్లాలో 4.5లక్షల ఎకరాల వరి సాగు చేయనున్నారని,11.5లక్షల మెట్రిక్‌టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటికే 10లక్షల టన్నుల యూరియా నిల్వ ఉందని, సొసైటీలకు, ఆర్ఎస్‌కెలకు పంపుతున్నామని జిల్లా అధికారులు చెబుతున్నారు. ఆత్మకూరు ప్రాంతంలో ఆత్మకూరు సిండికేట్ రైతుసేవా సహకారసంఘం, బట్టేపాడు, వెన్నవాడ సొసైటీలు, సచివాలయాలున్న గ్రామాల్లో రైతుసేవాకేంద్రాలున్నాయి. ఆత్మకూరు సొసైటి నాలుగుమండలాల్లోని గ్రామాలు పరిధిగా ఉన్నాయి. అందరికీ ఈసొసైటిద్వారా సరఫరా చేయాల్సి ఉండగా అరాకొరాగానే ఇస్తున్నారు. ఇక సొసైటిలు, ఆర్ఎస్‌కెల ద్వారా రైతులకు కార్డులు మాత్రం రాస్తున్నా తగినంతగా అవసరం మేరకు యూరియా సరఫరా కావడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వంద్వారా అందే యూరియా బస్తా 280రూపాయలు కాగా ప్రవేటు డీలర్లవద్ద 380రూపాయలు అమ్ముతుండగా మహిమలూరులో 400రూపాయలకు పైగానే అమ్ముతున్నారని రైతులు చెబుతున్నారు. ఆత్మకూరు మండలంలో దాదాపు 12వేల ఎకరాల్లో రబీసీజన్‌లో వరిసాగు చేస్తుంటారు. ఈదపా నీరు సమృద్ధిగా ఉన్నందున ఇంకా కొంత పెరిగే అవకాశం ఉందంటున్నారు. ఆత్మకూరు మండలం మహిమలూరు నాలుగువేల పైచిలుకు జనాభా కలిగిన మేజర్ గ్రామం కాగా రెండు చెరువులుండగా ఆయకట్టు 3500 ఎకరాలు ఉండగా మరో 1500 ఎకరాల్లో అనధికారికంగా వరి సాగుచేస్తుంటారని, తమ గ్రామానికి మంగళవారం వరకు ఒక్కబస్తా యూరియా కూడా అటు ఆత్మకూరు సిండికేట్ రైతు సేవా సహకార సంఘం ద్వారా కానీ, రైతుసేవా కేంద్రం ద్వారా కానీ సరఫరా కాలేదని తెలిపారు. అయితే గ్రామంలో 3 ఎరువుల దుకాణాలుండగా ఇదే అదనుగా భావించిన వ్యాపారులు బస్తా 400రూపాయలకుపైగా విక్రయిస్తున్నారు. ఈలెక్కన రైతులు తీవ్రంగా నష్టపోతున్నా యూరియా డిమాండ్ ప్రచారంతో రైతులు ఏమాత్రం లెక్కచేయకుండా అధికధరలకు యూరియా కొనుగోలు చేసుకొని నిల్వ చేసుకుంటున్నారు. రైతుల ఆందోళన, అవసరం, నిల్వ చేసుకోవాల్సిన ఆవశ్యకతను గుర్తించి అధికారులు సమృద్ధిగా యూరియా సరఫరాచేయాలని రైతులు కోరుతున్నారు. పెద్ద గ్రామమైన మహిమలూరుకు ఇంకా ఒక్క బస్తాకూడా సరఫరాచేయకుండా ప్రవేటు వ్యాపారులకు అవకాశం కల్పించినట్లుగా ఉందని అభిప్రాయపడుతున్నారు. ఈధరల పట్ల అధికారులు పరిశీలించడం, నియంత్రించడం జరగడం లేదంటున్నారు. కొందరు రైతులైతే ప్రభుత్వం సరఫరాచేయాల్సిన సొసైటిలు, ఆర్ఎస్‌కెల వద్ద యూరియా లభించకపోతుండగా ప్రవేటు వ్యాపారుల వద్ద ఎలా ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. 70శాతం సొసైటీలద్వారా, 30శాతం ప్రవేటుగా యూరియా అందుతుందన్న అధికారులు ఈపరిస్థితిని పరిశీలించాల్సి ఉందంటున్నారు. మరి జిల్లా వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది.

## మౌలానా ఆజాద్‌ది దేశ నిర్మాణంలో కీలక పాత్ర

### రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం పురస్కరించుకొని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ఘనంగా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య సమరయోధుడు, మహాన విద్యావేత్త. ఆయన దేశ విద్యా వ్యవస్థకు బలమైన పునాదులు వేశారు. తొలి విద్యామంత్రిగా ఐఐటీలు, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) వంటి సంస్థలను స్థాపించడం ద్వారా భారత విద్యా రంగ అభివృద్ధికి అపూర్వమైన సేవలు అందించారు. యువత ఆయన ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని దేశ అభివృద్ధి పథంలో నడవాలి' అని పేర్కొన్నారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సిహెచ్ విజయ, ఆచార్య టి.వీరారెడ్డి, యన్ఈపీ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.మధుమతి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, పిఆర్ఓ డాక్టర్ కోట నీలంమణికంఠ, డాక్టర్ సిహెచ్. కిరణ్మయి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఆర్‌వీఎస్ఎస్ నాగభూషణరావు, డాక్టర్ సుచరితతోపాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

## మాజీ ఎంపీటీసీ మెంబర్ కోడూరు మృతి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణానికి చెందిన సీనియర్ దళితనాయకుడు, మాజీ ఎంపీటీసీ మెంబర్ కోడూరు రామయ్య (64) అనారోగ్యంతో కొంతకాలంగా బాధపడుతూ సోమవారం మృతిచెందగా మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. కోడూరు రామయ్య భార్య గతంలోనే మృతిచెందగా నలుగురు సంతానం ఉన్నారు. ఆయన తొలుత సిపిఎం నాయకుడుగా ఉంటూ కాంగ్రెస్‌లో చేరి ఎంపీటీసీ మెంబర్‌గా ఎన్నికై మండల కాంగ్రెస్ విప్‌గా కూడా ఐదేళ్ళు కొనసాగాడు. ఆయన జిల్లా ఎస్టీ, ఎస్టీ అట్రాసిటి కమిటీ మెంబర్‌గా కూడా నియమితులై మూడేళ్ళపాటు కొనసాగాడు. 2024 ఎన్నికలనాటి నుండి ఆయన తెలుగుదేశం నాయకుడుగా వ్యవహరిస్తున్నాడు. మంగళవారం వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య, మున్సిపల్ వైస్‌చైర్మెన్ డాక్టర్ కె.వి.శ్రావణ్‌కుమార్‌రెడ్డి, తెలుగుదేశం రాష్ట్ర నాయకుడు దావా పెంచలరావు, తెలుగుదేశం నాయకుడు, ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ మాజీ చైర్మెన్ ఇందూరు వెంకటరమణారెడ్డి, సిఐటియు జిల్లా నాయకుడు జి.వి.శివప్రసాద్, పట్టణ సిపిఎం కార్యదర్శి కె.డేవిడ్‌రాజు, విద్యుత్‌ఉద్యోగుల సంఘ నాయకుడు మహేష్, మాజీ వార్డు మెంబర్, వైసిపి నాయకుడు తోడేటి మణి, తెలుగుదేశం నాయకులు ఉసురుపాటి బాలకొండయ్య, రజని, దివానపు నరశింహరావు, నాగులూరు చిన్నబ్బయ్య, బహుజనసమాజ్‌పార్టీ నియోజకవర్గ నాయకుడు టి.కృష్ణ, పలువురు బంధుమిత్రలు కోడూరురామయ్య మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. కోడూరు రామయ్య ఎంపీటీసీ మెంబర్‌గా, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటికమిటీ మెంబర్‌గా ప్రజలకు విశేషసేవలందించారని వారంతా కొనియాడారు. రామయ్య గతంలో సిపిఎం నాయకులతో, కాంగ్రెస్‌కు చెందిన దివంగత మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి, దివంగత మాజీ మండలాధ్యక్షుడు, మాజీ ఆత్మకూరు సర్పంచ్ డాక్టర్ బొమ్మిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డిలకు అత్యంత సన్నిహితుడుగా ఉండేవారు. ఆయన గత ఎన్నికలనాటినుండి రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి అనుచరుడుగా వ్యవహరిస్తున్నారు.

### నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న

## రెండో అంతస్తు తొలగించిన అధికారులు



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ ఆదేశాల మేరకు స్థానిక 39 డివిజన్ ఇరుగాలమ్మ దేవస్థానం సమీపంలో పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులను అతిక్రమించి నిర్మిస్తున్న భవనంలోని రెండవ అంతస్తు నిర్మాణాన్ని సిబ్బంది మంగళవారం తొలగించారు. 45వ డివిజన్ నక్కలోళ్ళ సెంటర్ ప్రాంతాల్లో అనుమతులను ఉల్లంఘించి నిర్మిస్తున్న భవనం రెండవ అంతస్తు సెంట్రింగ్ తొలగించారు. అదేవిధంగా 31వ డివిజన్ ప్రాంతంలో రోడ్డు ఆక్రమణలను తొలగించారు.

## టీం ఫైవ్ క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్



**కోవూరు, మేజర్‌న్యూస్ :** టీం ఫైవ్ క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా కోవూరు మండలం ఇనమడుగులో 46 పంచాయతీలకు చెందిన కార్యదర్శులతో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు డిఎల్పిఓ పుట్టా రమణయ్య,గూడూరు డిఎల్డిఓ వాణి పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీలోని క్లీన్ అండ్ గ్రీన్‌పై కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నెల్లూరు డిఎల్‌పిఓ పుట్టా రమణయ్య మాట్లాడుతూ.. ప్రజలకు మనం ఏం చేయబోతున్నాము ఎలాంటి సేవ అందిస్తున్నాము ఆలోచించి ఒక పథకం ప్రకారం ఒక మంచి ఆలోచనతో చెత్త నుండి సంపద తయారుచేయు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామపంచాయతీలో చెత్త లేకుండా ఎప్పటికప్పుడు తరలించి పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. అనంతరం గూడూరు డిఎల్డిఏ వాణి మాట్లాడుతూ.. పచ్చదనం పరిశుభ్రత అనేది మన యొక్క బాధ్యత అని తెలిపారు చెత్తను నుండి సంపద తయారుచేయ కేంద్రం ఒక పార్కు లాగా ఏర్పాటు చేసి ప్రజలకు ఆహ్లాదకరంగా ఉండే విధంగా తీర్చిదిద్దాలన్నారు. వర్మి కంపోస్ట్ తయారీ డోర్ టు డోర్ కలెక్షన్స్ చేయడంలో కార్యదర్శి ముఖ్యపాత్ర పోషించాల న్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దామెర్ల ప్రమీలమ్మ, ఎంపిటిసి కొల్లారెడ్డి సునీల్ రెడ్డి, ఎంపీడీవో శ్రీహరి, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగహన సదస్సు

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు పట్టణంలో నీ గోనుగుంట రామయ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చిరుధాన్యల మేళా కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం వరి సాగు చేస్తూ ఉండటం వలన రైతులకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారని, దానికి ప్రత్యామ్నాయ పంటగా చిరుధాన్యాలు సాగుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవహగానా కార్యక్రమాలు చేపట్టి, ప్రోత్సాహాలు అందిస్తుందని, వారు తెలియజేశారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి మాట్లాడుతూ.. చిరుధాన్యాలు సాగుకు ఉదయగిరి నియోజకవర్గం అనుకూలమైన ప్రాంతంగా ఉంటుందని తద్వారా రైతులు అధిక మొత్తంలో చిరుధాన్యాలు సాగు చేయాలని ఆమె తెలియజేశారు. చిరుధాన్యాల సాగు చేయడంలో రైతులుకు లాభసాటిగా ఉంటుందని, పోషక విలువలు ఎక్కువగా ఉండడం వలన ప్రజాఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు, ఆత్మ డీపీఓ మురళి, జిల్లా ఏడీఏ నర్సొజీ రావు, ఐటీడీఏ ఏపీఓ నీరజా, వింజమూర్ సబ్ డివిజన్ ఏడిఏ శేషగిరి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఏఓ వాసు, నాలుగు మండలాల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ తెలుగుదేశం నేతల్లో జోష్ నింపిన అధిష్టానం

## పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు : ఎమ్మెల్యే కాకర్ల



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పండుగ వాతావరణంలో మండల గ్రామ క్లస్టర్ బూతు కమిటీల అధ్యక్ష కార్యదర్శులు ప్రమాణ స్వీకార మహోత్సవం నేతల లో జోష్ నింపింది. మంగళవారం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాల యంలో పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్య క్షులు కంభం విజయరామిరెడ్డి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పి.చంచల బాబు యాదవ్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి ఎల్‌సి రమణారెడ్డి హాజరయ్యారు. నియోజకవర్గంలోనే 8 మండలాల ముఖ్య నేతలు సమావేశా నికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు నాయకులకు పార్టీలో సముచిత స్థానం కల్పించడంలో తెలుగుదేశం ముందుంటుందని తెలిపారు కార్యకర్తలే పార్టీకి బలమని వారే నిజమైన సైనికులని తెలిపారు. పదవులు పొందిన ప్రతి ఒక్కరు పదవిని అలంకారప్రాయంగా చూడకుండా ప్రతి కార్యకర్తకు అందు బాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలని నాయకు లకు నాయకులకు దిశా నిర్దేశం చేశారు. నేటి నుండి మూడు రోజులపాటు మండల క్లస్టర్ యూనిట్ గ్రామం బూతు కమిటీల ప్రమాణ స్వీకార మహో త్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులు పార్టీ సూచించిన నేతలు అఖండ విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మండల కన్వీనర్‌గా గూడా నర్సారెడ్డి, దుత్తలూరు మండల కన్వీనర్‌గా ఉండేల గురువారెడ్డి వరికుంట పాడు మండల కన్వీనర్‌గా చంద్ర మధుసూదన్‌రావు, సీతారాంపురం కన్వీ నర్‌గా చింతల శ్రీనివాసులు కొండాపురం కన్వీనర్‌గా పోలినేని చంద్రబాబు నాయుడు, జలదంకి మండల కన్వీనర్‌గా మునగాల తిరుమలరెడ్డి, అలాగే మండల క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ప్రధాన కార్యదర్శులు, కో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ప్రమాణ స్వీకారాన్ని ఎమ్మెల్యే చేయించారు. కార్యక్రమంలో 8 మండలాల తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు అభిమానులు హాజరయ్యారు.

# పీ4 ద్వారా దత్తత తీసుకున్న కుటుంబాలకు సరుకులు పంపిణీ



## 14 మంది విద్యార్థులకు ఉన్నత విద్య కోసం 1,44,000 ఆర్థికసాయం

**కావలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన పీ4 కార్యక్రమం కింద దత్తతకు తీసుకున్న 24 బంగారు కుటుంబాలకు సంయుక్త సేవా సంస్థ సభ్యులు నిత్యవసర వస్తువులు బియ్యం కూరగాయలు వితరణ చేశారు. ఈ కార్యక్రమం కావలి ఆర్డీఓ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్డీఓ ఎస్.వంశీకృష్ణ కావలి ఎంపీడీవో శ్రీదేవి హాజరయ్యారు. డాక్టర్ బెజవాడ రవికుమార్ వారి కుటుంబ సభ్యుల సహకారంతో 14 మంది నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్య నిమిత్తం ఆర్డీవో వంశీకృష్ణ ఎంపీడీవో శ్రీదేవి చేతుల మీదుగా లక్ష 44000 రూపాయలను అందజేశారు ఆర్డీఓ ఎస్ఎన్ఈ వంశీకృష్ణ, ఎంపీడీవో శ్రీదేవి మాట్లాడుతూ కావలి నియోజకవర్గం లో పీ4 కింద బంగారు కుటుంబాలకు సంయుక్త సేవా సమస్త చేస్తున్న సేవలను వారు కొనియాడారు. ఈ సమస్యకు అండగా నిలుస్తూ అన్ని విధాలగా మద్దతు ఇస్తున్న దాతలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నత విద్య కోసం ఆర్థిక సహాయాన్ని అందించిన డాక్టర్ బెజవాడ రవికుమార్ని వారు ప్రత్యేకంగా ప్రశంసించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన పీ4 కార్యక్రమం ద్వారా 24 బంగారు కుటుంబాలకు భరోసా కల్పించడం గొప్ప విషయమని తెలిపారు. అనంతరం కావలి ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణను ఘనంగా సన్మానించారు. పీ4 కార్యక్రమానికి తోడ్పాటు అందిస్తున్న డాక్టర్ పి.శ్రీధర్ డాక్టర్ సిహెచ్. విజయభాస్కర్ రావు డాక్టర్ పి.శివప్రసాద్ ఎం.అజిత్ బాబు, పచ్చిపులుసు వెంకన్న, పి.రాజా, పీఐ.జఫ్రాన్, ఎం.చంద్రశేఖర్, పీవీ సాయి తేజతోపాటు సేవా సంస్థ వ్యవస్థాపకులు జి.సురేంద్రను అభినందించి, ఘనంగా సన్మానించారు.

# ఉద్యోగం, సంతకం ఎక్కడ.? ఎమ్మెల్యే కావ్యా.!

- ఎన్నికల సమయంలో భూములు కోల్పోయిన తీర ప్రాంతాల రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి..
- మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వైఎస్ఆర్‌సిపి నియోజకవర్గ ఇన్ చార్జ్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించి తీరప్రాంతాల్లో భూములు కోల్పోయిన రైతుల సమస్యలపై మాట్లాడారు. ఎన్నికల సమ యంలో రామాయపట్నం పోర్టుకి ప్రభుత్వం భూసేకరణ చేస్తున్న సమయంలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ప్రభుత్వం ద్వారా నష్టపరిహారాన్ని అందించేందుకు ఎంతో శ్రమిం చి ప్రభుత్వాలతో మాట్లాడి తగిన విధంగా అన్యా యం జరగకుండా వారి నష్టపరహారాన్ని అందిం చేందుకు కృషి చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి భూముల కొరకు తను తీరప్రాంతాల్లో ప్రభుత్వానికి ఇస్తే ఎకరాకు 50లక్షల రూపాయ లు ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందించే దుకు నేను హామీ ఇస్తున్నానని, అలాగే భూములు కోల్పోయిన ప్రతి వ్యక్తి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించేందుకు నేను హామీ ఇస్తున్నట్లు ఆనాడు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి నష్టపరిహారం ఇప్పించి దానికి తగ్గ పారిస్తూ తీసుకుంటాడని ఆనాడు ఆరోపించడం జరిగింది. ఇప్పుడు ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న కావ్య కృష్ణారెడ్డి ఆరోజు మాట్లాడిన మాటలను భూములు కోల్పోయిన రైతులు తన వద్దకు వచ్చి అడిగినప్పుడు ఇంతే ఇచ్చేది లేకపోతే మీకు చేతనైనది చేసుకోండి అని అనడం విశేషం. ఒకరిపై నిందలు మోపడం, అబద్ధాలు చెప్పడం, చెప్పిన మాటను తప్పడం, ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోతే ఇంకా కావలి నీ మీరు ఎలా కాపు కాస్తారని ఘాటుగా ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ ఘాటుగా విమర్శలు చేశారు. ఇప్పటికైనా నిజాయితీగా, చెప్పిన మాటలు నిలబెట్టుకొని భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని రైతుల పక్షాన మేము పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి నియోజకవర్గం వైసీపీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్ఎస్ఆర్ కళాశాలలో నేషనల్ ఎడ్యుకేషన్ డే



**కావలి, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం కడనూతల రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని నేషనల్ ఎడ్యుకేషన్ డేని కళాశాల ఐఐసీ(ఫామ్ ఇన్స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ విద్యా విధానం గురించి, విద్య యొక్క ప్రాముఖ్యత గురించి బీటెక్ విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగ అధిపతి అయిన డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ.. నైతిక విలువలతో, క్రమశిక్షణతో, సమయపాలన పాటించాలని విద్యార్థిని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్‌వి రమణారెడ్డి, ఐఐసీ అధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ పి.బృందావని, అన్ని విభాగాల అధిపతులు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

## వింజమూరు క్లస్టర్ ఇన్‌చార్జ్‌గా వసంతరావు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు క్లస్టర్ ఇన్‌చార్జ్‌గా చేబ్రోలు వసంతరావును ప్రకటించారు. మంగళవారం వింజమూరు లోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాల యంలో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా ప్రకటించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ.. పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా శాయ శక్తుల పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ చంచలమైన విశ్వాసంతో పనిచేసే పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఢిల్లీలో బాంబు పేలుళ్ల మృతులకు నివాళులు

- నెల్లూరు అలంకార్ సెంటర్‌లో ఉగ్రవాదం దిష్టిబొమ్మ దహనం



**నెల్లూరు అర్బన్, మేజర్‌న్యూస్ :** భారతదేశంలో భయానక వాతావరణాన్ని సృష్టించేందుకు పాకిస్తాన్ తీవ్రవాద సంస్థలు ఉగ్ర పేలుళ్లకు నిరసిస్తూ అలంకార్ సెంటర్లో ఉగ్రవాదం దిష్టిబొమ్మను బీజేపీ కార్యకర్తలు దహనం చేశారు. ఉగ్ర పేలుళ్ల లో మృతి చెందిన దేశ పౌరులకు బీజేపీ కార్యకర్తలు కర్పూరం హారతులు ఇచ్చి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నేత మిడతల రమేష్, రాజేశ్వరమ్మ, మురగ నరేష్‌లు మాట్లాడుతూ.. ఆపరేషన్ సింధు తర్వాత భారతదేశంలో పేలుళ్లు తీవ్రంగా ఉంటాయని జైషే మహమ్మద్ ప్రకటించింది. ప్రకటించింది దేశంలోని ఎన్ఐఏ పోలీస్ వ్యవస్థ పటిష్టంగా పనిచేయడంతో అనేకమంది ఉగ్రవాదులను అరెస్ట్ చేసి భారీ విధ్వంశాలను అదుపు చేశారు. ప్రాణాలు పోసే ప్రాణాలు కాపాడే డాక్టర్లు ఉగ్రవాదం ద్వారా ప్రాణాలు తీస్తుండడం పట్ల భారత సమాజం ఆందోళన చెందుతూ ఉంది. పాక్ ఉగ్రవాదాన్ని భారత ప్రభుత్వం అంతం చేయాలని బీజేపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరమ్మ, మనోవ త్రావ్యా, ఏవి సుబ్బయ్య, అల్లూరు నాగేంద్ర సింగ్, సరస్వతి, సృజన, కందుకూరు శివకుమార్ గన్నవరం దశరథ రామయ్య, మురగ నరేష్, సోమ గోపాల్ చిట్టిబాబు, విజయ గోపాల్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. నారాయణరావు బుధవరపు బాలాజీ, సోమ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీ స్థలాలను గుర్తించి పన్నులు విధించండి : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ సమీక్షా సమావేశంలో భాగంగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంగళవారము రెవిన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, సమయానుకూలంగా పరిష్కరించాలని ఆదేశించారు. పై విషయంపై ముఖ్యమంత్రి కార్యాలయం జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాల ద్వారా పర్యవేక్షణ చేస్తున్నందున, ఎటువంటి అలసత్వం పనికిరాదని హెచ్చరించారు. ప్రతి పరిపాలన కార్యదర్శి తమ సచివాలయ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు రెవిన్యూ వసూళ్లపై దృష్టి పెట్టాలని, అలాగే ఖాళీ స్థలాలను గుర్తించి పన్నులు విధించడంలో చురుకుగా వ్యవహరించాలని సూచించారు. కొత్తగా నిర్మించిన ఆస్తులు, అదనపు అంతస్తులు, అపార్ట్మెంట్లకు వెంటనే పన్నులు విధించి ట్యాక్స్ పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే, అర్జీదారులు అభ్యర్థించిన వివిధ సేవా అభ్యర్థనలను నిర్ణీత సమయాల్లో పూర్తి చేయాలని సూచించారు. డిసెంబర్ నెలలో జరగనున్న నేషనల్ లోక్ అదాలత్‌లో 25వేలకు పైబడిన బకాయిలు ఉన్నవారిని గుర్తించి వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. గతంలో నోటీసులు అందుకొని లోక్ అదాలత్‌కు హాజరుకాని వారు లేదా హాజరై బకాయిలు చెల్లించని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవిన్యూ అధికారులు తమ పరిధిలో కనీసం 40 లక్షల రెవిన్యూ వసూళ్లు సాధించేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఖాళీ స్థలాలకు పన్నులు విధించేందుకు టౌన్ ప్లానింగ్ సిబ్బంది సహకారంతో లేఅవుట్లను గుర్తించాలని సూచించారు. ప్రతి రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ తమ పరిధిలోని పరిపాలన కార్యదర్శులను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ పన్ను వసూళ్ల ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, డిప్యూటీ డైరెక్టర్ మాధురి, టిపిఆర్‌ఓ వాసు బాబు, రెవిన్యూ ఆఫీసర్లు సమద్, శ్రీనివాసులు, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# బోడబండ సప్లయ్ చానెల్ పరిశీలన

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి చిన్న, పెద్ద చెరువులకు వరద నీరు అందించే బోడ బండ సప్లయ్ చానెల్ను మంగళవారం జల వనరుల పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ కందుకూరి చంద్రమౌళి మాట్లాడుతూ.. సప్లయ్ చానెల్ సమీపంలో లేఅవుట్లు ఉండడంతో కొందరు ఎక్స్కవేటర్‌తో కాలువ ఆ క్రమించేం దుకు యత్నిస్తున్నారని తమకు ఫిర్యాదులు అందా యన్నారు. దీంతో చదును చేసిన వారిపై రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయడంతోపా పరిశీలించడం జరిగిందన్నారు. కాలువ పోరంబోకు స్థలంలో వేసి ఉన్న రాళ్లను తొలగించడం జరిగిందన్నారు. త్వరలో బోడ బండ సప్లయ్ చానెల్, చిన్న, పెద్ద సర్వే చేయించి హద్దురాళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైనా ఆయా స్థలాలను ఆక్రమించి ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని ఆయన హెచ్చరించారు. ఈ ఏఈలు వేణు, సురేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేడు నిరసన ర్యాలీని జయప్రదం చేయండి : మాజీ ఎమ్మెల్యే



**కావలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సిపి వ్యవస్థాపక అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మెడికల్ కాలేజీ లను ఏర్పాటు చేశారు. ఆ మెడికల్ కాలేజీ పూర్తయ్యే సమయంలోపల సాధారణ ఎన్నికలు రావడం ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారం రావడం జరిగింది. అయితే గత వైసిపి ప్రభుత్వం లో నిర్మించిన మెడికల్ కాలేజీను ప్రస్తుత తెలుగుదేశం పార్టీ ప్రైవేట్ వ్యక్తులకు అప్పచెప్పాలని ఆలోచనతో ఉన్నందున విషయాన్ని గ్రహించిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆ పిలుపుని అందుకొని కావలి నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మంగళవారం వైసీపీ కార్యాలయంలో పత్రికల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ నియోజక వర్గంలో పూర్తి చేసుకున్న సందర్భంగా నేడు నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ఆర్ఎస్ఆర్ కళ్యాణమండపం వద్ద నుండి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి, అక్కడినుండి ఆర్డిఓ కార్యానికి రావడం జరుగుతుందని అనంతరం ఆర్డీఓకి వినతి పత్రాన్ని అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి కావలి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. కోటి సంతకాల సేకరణ నెల్లూరు జిల్లాలో కావలి ప్రమ స్థానంలో ఉందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

# పొలం పిలుస్తుంది కార్యక్రమం



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండలంలోని తురిమెర్ల, దేవర వేమూరు పంచాయతీ పరిధిలో స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద రైతుల పొలాలకు క్షేత్ర సందర్శనతోపాటు రైతుల పొలాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించేందుకు పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి హైమావతి, వీఏ నిర్వహించారు. స్థానిక రైతులతో కలిసి పొలాలను పరిశీలించిన అనంతరం గ్రామంలోని ప్రజలతో స్థానిక సైదాపురం మండలంలోని తురిమెర్ల, దేవరవేమూరు రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. రైతులు పంటలు వేసుకుని మొదలు పంట నూర్పులు చేసేంతవరకు ఎప్పటికప్పుడు స్థానిక వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు తీసుకొని అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందని వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోని రైతులు రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలని తద్వారా వేసిన పంటలలో పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడి సాధించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు .ఈ పొలం పిలుస్తుంది కార్యక్రమం వారంలో ప్రతి మంగళ, బుధవారాలలో ప్రతి గ్రామంలో పొలాలను సందర్శించి రైతులకు యజమాన్య పద్ధతుల గురించి వివరిస్తామని తెలిపారు. అనంతరం రైతులకు ఆర్ఎన్‌టి 15048 వరి రకం నవంబర్ 15పైన నాటుకున్న ట్లయితే ఆశించిన దిగుబడులు ఉంటాయని లాభసాటిగా ఉంటుందని రైతులకు తెలియజేశారు. అలాగే ప్రతి రైతు సేవ కేంద్రంకు యూరియా పొజిషన్ చేయడం జరిగింది. అలానే సొసైటీ కూడా 36ఎంటీల యూరియా కూడా పొజిషన్ చేయడం జరిగింది. రైతులందరూ కూడా వరి పైరుకు మూడు బస్తాలు మాత్రమే ఉపయోగించాలని, లేనియెడల భూమి కాలుష్యం నీటి కాలుష్యంతో పాటుగా పర్యావరణ కాలుష్యం, మానవ ఆరోగ్యం క్యాన్సర్లు వంటి ప్రాణాంతక రోగాలు కూడా విచక్షణ రహిత ఎరువులు పురుగుల మందులు వలన వస్తాయని మండల వ్యవసాయ అధికారి హైమావతి తెలిపారు. తురిమెర్ల, దేవరవేమూరు గ్రామంలో ఘనజీవామృతం తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె ఘన జీవామృతం తయారీ విధానంపై రైతులకు మండల వ్యవసాయ అధికారి హైమావతి తెలిపారు. ఘన జీవామృతం పంటలకు అందించడంవల్ల మంచి దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది మండల వ్యవసాయ అధికారి హైమావతి రైతులు, ఇదితరులు పాల్గొన్నారు.

## మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి
## అందించిన సేవలు అజరామరం : ఎంపీడీఓ




**రాపూరు, మేజర్‌న్యూస్ :** భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి రాపూరు మండల అభివృద్ధి అధికారిణి కార్యాలయంలో ఘన నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య సమర యోధుడిగా, తొలి విద్యాశాఖ మంత్రిగా దేశానికి ఆయన అందించిన సేవలు అజరామరం అని రాపూరు మండల అభివృద్ధి అధికారిణి భవాని కొనియాడారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆ చిత్ర పటానికి పూలమాలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో భవాని ప్రజలకు మైనార్టీ సంక్షేమ, జాతీయ విద్యాదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నల్లవడ్ల వెంకట రమణారెడ్డి, మారం మధురెడ్డి, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీలో మౌలానా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి జడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ ఎల్.శ్రీధర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పరిపాలన అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై స్పందిస్తున్న కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్న ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు స్థానిక ఆత్మకూరు బస్టాండు ఫ్లైఓవర్ సాయిబాబా టెంపుల్ సమీపంలోని సర్వేపల్లి కాలువపై ఉన్న పాదచారుల వంతెన ప్రాంతాన్ని మంగళవారం సందర్శించారు. పాదాచారుల వంతెనపై నిర్మించిన గడ్డర్లను తొలగించి ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలన్న స్థానికుల విజ్ఞప్తిని పరిశీలిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

## నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఉదయగిరిలో బుధవారం వైయస్సార్సీపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వింజమూర్ వైసీపీ మండల కన్వీనర్ రేవనూరు శ్రీనివాసులురెడ్డి కోరారు. ఉదయగిరిలో జరిగే ఈ నిరసన కార్యక్రమానికి మండలంలోని వైసిపి జడ్పిటిసి సభ్యులు సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు నాయకులు కార్యకర్తలు హాజరు కావాలన్నారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆయన తనయుడు మేకపాటి అభినవరెడ్డి హాజరవుతారన్నారు. కావున మండలం నుండి అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు అభిమానులు తరలి వెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు ఘనంగా నివాళి : ఎస్పీ



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా పోలీస్ కార్యాలయం నందు భారతరత్న జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినం పురస్కరిం చుకొని మంగళవారం జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల వారి చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడు భారతదేశంలో విద్యాభివృద్ధికి బాటలు వేసిన వ్యక్తి భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి గుణాత్మక విద్యకు మార్గదర్శి విద్యావేత్త శ్రీ మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని కొని యాడారు. అదేవిధంగా స్వాతంత్ర్యం ఏర్పడిన అనంతరం మొదటి ప్రభుత్వంలో సుదీర్ఘంగా 11 సంవత్సరాల పాటు విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన గొప్ప మేధావి అని అందుచేతనే ఆయన జన్మదినాన్ని నేషనల్ ఎడ్యుకేషన్ డే గా జరుపుకుంటున్నామని ఆమె వివరించారు. అంతేకాకుండా బ్రిటీష్ పాలనలో నిర్లక్ష్యానికి గురైన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, సంగీతం, సాహిత్యాల వికాసానికి చేయూత ఇచ్చిన వ్యక్తి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని.. 1992లో భారత ప్రభుత్వం మూలాన అబుల్ కలాం ఆజాద్‌కి భారతరత్న అవార్డు ఇచ్చి సత్కరించిందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెూంగార్డ్ డిఎస్పి, ఆర్ఐ అడ్మిన్, ఇతర పోలీస్, డిపిఓ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాలికపై లైంగిక వేధింపులకేసులో నిందితుడికి జీవిత ఖైదు



**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** అభం శుభం తెలీని ఏడు సంవత్సరాల వయసుగల మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడనే ఆరోపణలు రుజువు కావడంతో నిందితుడు మహమ్మద్ నజీర్ హుస్సేన్‌కు యావజ్జీవ కారాగార శిక్ష, వివిధ సెక్షన్ల కింద 40వేల రూపాయల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా ఫోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపి రెడ్డి సుమ మంగళవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు రెండవ నగర పోలీస్ స్టేషన్ పరిధిలోని జాకీర్ హుస్సేన్ నగర్‌లో నిందితుడు మొహమ్మద్ నజీర్ హుస్సేన్ జులాయిగా తిరుగుతుండేవాడు. వీరి ఇంటి సమీపంలో బాధిత బాలిక ఉండేది. పాప అమ్మ ప్రతిరోజు కూలి పనుల కొరకు బయటకు వెళ్ళేది. ఈ నేపథ్యంలో చిన్నారి బాలికపై కన్నేసిన నిందితుడు నజీర్ హుస్సేన్ 2020 డిసెంబర్ 12 మధ్యాహ్నం సమయంలో ఆ పాపను బెదిరించి బలవంతంగా పెన్నానది ఒడ్డున ఉన్నఒక ఇంటి లోనికి తీసుకెళ్లి ఆ పాపపై అసభ్యంగా లైంగిక వేధింపులకు పాల్పడినట్లు, విషయం బయటకు చెప్తే చంపేస్తాను అని నిందితుడు బెదిరించినట్లు చిన్నారి పాప తన కన్న తల్లికి తెలిపింది. ఈ సంఘటనపై బాధిత బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడు నజీర్ హుస్సేన్ పై కేసు నమోదు చేసి విచారణ అనంతరం కోర్టులో ఛార్జీ షీటు దాఖలు చేశారు. సమగ్ర విచారణ అనంతరం న్యాయమూర్తిపై మేర తీర్పు చెప్పారు. కేసును అప్పటి దిశా పోలీస్ స్టేషన్ డీఎస్పీ యు.నాగరాజు దర్యాప్తు చేశారు. ఈ కేసులో కోర్టు లైజన్ ఆఫీసర్‌గా ఏఎస్ఐ ఎం.అహ్మద్ బాదుషా వ్యవహరించారు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దూబిశెట్టి చంద్రశేఖర్ వాదించారు.

# కమిషనర్‌ని సన్మానించిన స్వచ్ఛంద సేవా సంస్థలు

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ ఇటీవల తుఫాన్ కారణంగా కావలి అర్బన్ ప్రాంతాల్లో రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతాన్ని నమోదు చేసుకుంది అయితే ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు తుఫాన్ సందర్భంగా ముందస్తు జాగ్రత్తలు చర్యల్లో భాగంగా కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ అర్బన్ లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న హరిజన, గిరిజనులను ఆ ప్రాంతాల్లో పక్కనే ఉన్న పాఠశాల భవనంలోకి తుఫాన్ షెల్టర్ లోకి తన సిబ్బందితో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అలాగే వర్షం సమయంలో కూడా యుద్ధ ప్రాతిపదిక పైన వారికి కావాల్సిన ఆహారం విద్యుత్తు నీరు సకాలంలో అందించడం జరిగింది. అంతేకాకుండా ముందస్తు చర్య భాగంగా ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టడం అభినందనీయమని దీనికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన సేవలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా సైక్లోన్ ఫైటర్ అవార్డును అందుకున్నారు. గురువారం కావలిలో వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల వారు కమిషనర్‌ని కలిసి ప్రేమపూర్వకంగా



కలుసుకొని దృశ్యాలువా పూలమాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొగల్సలీం, ఎంవి ప్రసాద్ రావు, దామా మధుసూదన్ రావు, ఎస్.రమేష్, వనజ, విశ్వశాంతి రమణయ్య, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

# లైన్మెన్‌కు విద్యుత్ షాక్‌తో తీవ్ర గాయాలు

▶ పరిస్థితి విషమించడంతో నెల్లూరుకు తరలింపు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం నాగులపాడు, యడవల్లి గ్రామాలకు చెందిన విద్యుత్ లైన్మెన్ పాశెం.విజయ్ కు నెల్లూరు పాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మత్తులు చేస్తూ ఉండగా మంగళవారం విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలు కలిగాయి. ఆత్మకూరులో హాస్పటల్‌కు తరలించి చికిత్స పొందుతూ పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తరలించారు. పాశెం విజయ్ స్వగ్రామం అనంతసాగరం మండలం సంజీవనగరం గ్రామం. విద్యుత్ నిలుపుదల చేసే విషయంలో సిబ్బంది సమన్వయలోపం కారణంగా ఈ ప్రమాదం జరిగినట్టు సమాచారం.

# మరుగుదొడ్ల అవినీతిపై విచారణ




**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలం రామసాగరం పంచాయతీ తూర్పుపుండ్ల గ్రామంలో 2016-17 ఏడాదిలో జరిగిన మరుగుదొడ్ల నిర్మాణంపై అధికారులు విచారణ చేపట్టారు. తూర్పుపుండ్ల గ్రామానికి చెందిన పల్లేటి వెంకటేష్ అనే వ్యక్తి మరుగుదొడ్ల నిర్మాణంలో 35 లక్షల మేర అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగాయి అంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆధ్వర్యంలో 12 మందితో కూడిన తనిఖీ బృందం పంచాయతీలో చేపట్టిన 213 మరుగుదొడ్ల నిర్మాణాలపై విచారణ చేపట్టింది. ఈ క్రమంలో ఆయా లబ్ధిదారుల నివాసాల్లో మరుగుదొడ్లను పరిశీలించి ఎవరు నిర్మించారు అని లబ్ధిదారులను అడిగి ఆరా తీశారు. అప్పట్లో నకిలీ మరుగుదొడ్ల నిర్మాణాల నివేదికలు, లబ్ధిదారులకు తెలియకుండానే వారి పేర్లపై మంజూరు అయిన నిధులను కొందరు అధికారులు, సంస్థలు దుర్వినియోగం చేయడం, అవినీతికి పాల్పడటం వంటి ఆరోపణలు వినిపించాయి. గతంలో ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత అధికారులు విచారణ జరిపి, నిధులను రికవరీ చేయడంతో పాటు నిందితులపై చర్యలు కూడా తీసుకున్న నేపథ్యంలో ప్రస్తుతం రామసాగరం పంచాయతీ మరుగుదొడ్ల వ్యవహారం మండలంలో చర్చనీయాంశమైంది.

# కార్యకర్తల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యం

● సీఎం చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్‌ల విజనరీతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి ● జలదంకి మండల కన్వీనర్‌గా తనకు అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు ప్రత్యేక అభినందనలు ● మండలంలో 17 పంచాయతీల టీడీపీ నాయకులు కన్వీనర్‌గా తనకు సహకరించడం పై వారికి ప్రత్యేక కృతజ్ఞతలు



**కావలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్‌ల విజనరీతో రాష్ట్రంసర్వతో ముఖాభివృద్ధి చెందుతుందని తెలుగుదేశం పార్టీ నిరంతరం పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసమే పని చేస్తుందని జలదంకి మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ మునగాల తిరుమలరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన వింజమూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సమక్షంలో, జలదంకి మండలం తెలుగుదేశం పార్టీ నాయకుల అభిమానాల మధ్య మండల కన్వీనర్‌గా పదవి స్వీకరణ చేపట్టారు. ఈ సందర్భంగా తిరుమలరెడ్డిని జలదంకి మండలంలోని 17 పంచాయితీల టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షధ్వానాల మధ్య తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన తిరుమలరెడ్డి మాట్లాడుతూ.. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని సందర్శిస్తూ పేదలు, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వారి సమస్యల పరిష్కారానికి ఎంతో చొరవ చూపిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని 8 మండలాల్లో ఎక్కడ ఏ సమస్య ఉన్న తానై ఉంటూ సహాయ చర్యలు చేపట్టడంపై నియోజకవర్గ ప్రజలు అయనకు ఎంతో కృతజ్ఞతలు తెలియజేస్తున్నారన్నారు. ఆయన చేస్తున్న సేవలపై ప్రతిరోజు ప్రజల స్పందన చూస్తుంటే తమకు ఎంతో ఆనందం కలుగుతుందని అన్నారు. జలదంకి మండల కన్వీనర్‌గా తనను నియమించినందుకు ఎమ్మెల్యే కాకర్లకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. అలాగే తనను మండల కన్వీనర్‌గా నియమించేందుకు సహకరించిన మండలంలోని 17 పంచాయతీల టీడీపీ నాయకులు కార్యకర్తలకు తాను ఎంతో రుణపడి ఉంటానని అన్నారు. జలదంకి మండలంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్ఫూర్తితో ఆదేశాలతో ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అలాగే జలదంకి మండలంలో రైతులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తెలుగుదేశం పార్టీ తరపున తాను కృషి చేస్తానని వివరించారు. తెలుగుదేశం పార్టీ లక్ష్యమే పేద ప్రజల అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీలో విలువ ఉంటుందని వారికి అండగా ఉండడమే లక్ష్యంగా పనిచేయాలని యువ నాయకుడు లోకేష్ పిలుపునిచ్చారని ఆయన స్ఫూర్తితో తాము కూడా కార్యకర్తల సంక్షేమ లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. తనకు మండల కన్వీనర్ పదవి దక్కేందుకు జలదంకి మండలంలోని ప్రతి తెలుగుదేశం పార్టీ, నాయకుడు, కార్యకర్తలు తాను ఎప్పటికీ రుణపడి ఉంటానని ప్రత్యేకంగా తెలియజేశారు.

# కొండే జీవనాధారం.. క్వార్ట్జ్ తవ్వకాలకు ఒప్పుకోం..

## ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్తుల ఆవేదన




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** తమది మెట్ట ప్రాంతం.. వర్షాధారంతోనే పంటలు సాగు చేస్తాం.. దీంతోపాటు మూగజీవాలను మేపుకుని జీవనం సాగిస్తాం.. వీటన్నింటికి పచ్చటి అందాలు.. సెలయేళ్లు సాగే ఈ కొండల్లే ఆధారం.అలాంటి కొండను క్వార్డ్ (తెల్లరాయి) కోసం తవ్వి పర్యావరణాన్ని పాడు చేస్తామంటే తాము ఒప్పుకునే ప్రసక్తే లేదనిమండ లంలోని బండగానిపల్లి రెవెన్యూ పరిధిలోని గ్రామస్తులు అధికారుల ఎదుట తమ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని బండగానిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 616/ పీ, 624/ పీలలో 32,777 హెక్టార్ల ప్రభుత్వ భూమిలో ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ క్వార్డ్ తవ్వకాలకు ప్రభుత్వ అనుమతులు ఇవ్వడంతో మంగళవారం ఆత్మకూరు ఆర్డీవో బీ.పావని, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ అశోక్ కుమార్‌లు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ భూమిలో ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ రూ.1.25కోట్ల మూలధన వ్యయంతో ఏడాదికి 99,900టన్నుల క్వార్ట్జ్ తవ్వకాలను చేపడుతుందని, ప్రజల అభిప్రాయాలను తెలిపాలని సూచించారు. స్పందించిన గ్రామస్తులు తాము మెట్ట ప్రాంత వాసులమని, వర్షాధారంపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తామన్నారు. తమ గ్రామంలో అధికశాతం మంది మూగజీవాలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఆ జీవాల మేతకు, వర్షాలు కురిసిన సమయంలో కొండల్లో పారే సెలయేళ్ల నీటితో లింగాల చెరువు జలకళ సంతరించుకుని ఏడు గ్రామాల రైతులు రెండుకార్లు వాణిజ్య, ఇతరత్రా పంటలు సాగు చేసి జీవనం సాగించేందుకు ఈ కొండే ఆధారమన్నారు. అలాంటి కొండను తవ్వి క్వార్ట్ తవ్వకాలు చేస్తే తాము తీవ్రంగా నష్టపోతామని అధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. క్వార్ట్జ్ తవ్వకాలతో పంటలు నాశనమవడంతోపాటు సమీపంలో ఉండే అడవులు దెబ్బతింటాయన్నారు. ఎట్టి పరిస్థితులు తవ్వకాలకు అనుమతులు ఇవ్వవద్దని తేల్చిచె ప్పారు. స్పందించిన అధికారులు మీ అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో అందజేసి తదుపరి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఏలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచోసుకోకుండా ఉదయగిరి సీఐ ఎన్.వెంకట్రావు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి తహసీల్దారు షాజియా, ఎంపీటీసీ కాకు విజయమ్మ, సర్పంచ్ లక్కు రమణమ్మ, రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది, కంపెనీ, ఎన్డీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

# గోళ్లవారిపల్లె బాధిత కుటుంబానికి అండగా ఎంపీ వీపీఆర్

## 5లక్షల చెక్కు అందజేసిన వీపీఆర్ సిబ్బంది



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** కర్నూలు బస్సు ప్రమాద బాధిత కుటుంబానికి అండగా ఉంటానని ప్రమాదం రోజున హామీ ఇచ్చిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఇచ్చిన మాట మేరకు ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించారు. కర్నూలు రోడ్డు ప్రమాద ఘటనలో మృతి చెందిన వింజమూరు మండలం గోళ్లవారిపల్లెకు చెందిన గోళ్ల రమేష్ కుటుంబ సభ్యులకు నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆర్థిక భరోసా అందించారు. బాధిత కుటుంబానికి 5 లక్షల చెక్కు అందజేశారు. ఈ మేరకు విపిఆర్ సిబ్బంది శంకర్, రమేష్ తదితరులు రమేష్ కుటుంబాన్ని కలిసి చెక్కును అందించారు. ఇటీవల ప్రమాదంలో చనిపోయిన బాధిత కుటుంబాన్ని పరామర్శించే సమయంలో తన తరపున 5లక్షలు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు మంగళవారం మృతుడు రమేష్ తండ్రి మాలకొండయ్య, తల్లి సుశీలకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి మనోధైర్యం అందించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి బాధిత కుటుంబానికి ఎప్పుడూ అండగా ఉంటారని వారు తెలిపారు. ఎలాంటి పరిస్థితుల్లో అయినా తప్పకుండా సహాయం చేసేందుకు ముందుంటామని వెల్లడించారు. బాధిత కుటుంబ సభ్యులు కొండా మహేశ్వర రావు మాట్లాడుతూ.. ఇచ్చిన మాట మేరకు తమ కుటుంబానికి అండగా నిలబడిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి మద్దతు ఎప్పుడు ఇలాగే ఉండాలని వారు కోరారు.

# ఢిల్లీ పేలుళ్లను ఖండించిన జనసేన పార్టీ నాయకులు

## గాంధీ బొమ్మ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన




**నెల్లూరు అర్బన్, మేజర్‌న్యూస్ :** ఢిల్లీ పేలుడు పిరికిపంద ఉగ్ర చర్యను జనసేన తీవ్రంగా ఖండిస్తోంది.. గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తుల నిరసన నిన్న (సోమవారం) సాయంత్రం సుమారు 6:52 గంటల ప్రాంతంలో ఢిల్లీ లోని ఎర్రకోట మెట్రో స్టేషన్ గేట్ నంబర్ 1 సమీపంలో జరిగిన హృదయ విదారక బాంబు పేలుడు ఘటనను జనసేన పార్టీ తరపున తీవ్రంగా ఖండి స్తున్నాము. ఈ పిరికిపంద ఉగ్రవాద చర్యలో దురదృష్టవశాత్తూ 12 మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా, మరో 24 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటన దేశంపై జరిగిన దాడిగా జనసేన పార్టీ భావిస్తోంది. ఈ సంద్రభంగా జనసేన పార్టీ సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ.. దర్యాప్తు సంస్థలు వేగంగా పనిచేసి, ఈ కుట్ర వెనుక ఉన్న అసలు సూత్రధారులను, డాక్టర్ ఉమర్ వంటి అనుమానితులను తక్షణమే పట్టుకోవాలని కేంద్ర ప్రభుత్వం తక్షణమే దేశవ్యాప్తంగా, ముఖ్యంగా రద్దీ ప్రాంతాలు, సరిహద్దుల్లో నిఘాను పటిష్టం చేయాలి. తీవ్రవాదాన్ని వేరుతో సహా నిర్మూలించడానికి పటిష్టమైన దీర్ఘకాలిక వ్యూహం అవసరం. ఖచ్చితంగా ఈ దారుణం చేసిన వారిని కేంద్ర ప్రభుత్వం కటినంగా శిక్షించాలని కోరుతున్నామని తెలియజేశారు. ఈ దారుణంలో మరణించిన పౌరుల కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈరోజు నెల్లూరు నగరం లోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద జనసేన నాయకులు, కార్యకర్తలు శాంతియుత కొవ్వొత్తుల నిరసన తెలిపారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ మౌనం పాటించడం జరిగింది. ఈ కార్యక్రమం లో జనసేన నాయకులు గుణకుల కిషోర్, శ్రీరామ్, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీపతి రాము, సుధా మాధవ్, కాకు మురళి, సురేష్, గుర్రం కిషోర్, మహిళలు నందిని, శాంతికళ, లత, కామాక్షి, ఆఫీస్ ఇన్‌చార్జ్ జమీర్ పాల్గొన్నారు.

# రీ సర్వేలో తప్పిదాలను సవరించండమ్మా..



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** గత ప్రభుత్వం చేపట్టిన భూ రీ సర్వే లో చోటుచేసుకున్న తప్పిదాలను సవరించాలని, నోషనల్ ఖాతా లు తొలగించాలని మంగళ వారం బండగానిపల్లి రెవెన్యూ పరిధిలోని పలు గ్రామాల రైతులు ఆత్మకూరు ఆర్డీఓ పావనికి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రీ సర్వే తప్పిదాలు, నోషనల్ ఖాతాల ప్రభుత్వం సంక్షేమ పథకాలు దరి చేరకపోవడంతోపాటు పంటల సాగుకు బ్యాంకు రుణాలు సైతం ఇవ్వడంలేదని వాపోయారు. ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగిన సమస్య పరిష్కారం కావడంలేదని ఆర్డీవో ఎదుట రైతులు వాపోయారు. స్పందించిన ఆర్డీఓ రీ సర్వేలో జరిగిన తప్పిదాలను సవరించేందుకు మరలా ఆయా గ్రామంలో సర్వే చేపట్టి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దారు షాజియా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు ధర్నాను విజయవంతం చేయండి : కొండా



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ప్రైవేటి కరుణ చెయ్యాలన్న నిర్ణయం వ్యతిరేకిస్తూ వైఎస్ఆర్సీపీ ఆధ్వర్యంలో బుధవారం నియోజకవర్గం కేంద్రమైన ఉదయ గిరిలో ఉదయం 10 గంటలకు జరిగే మహా ధర్నాను విజయవంతం చెయ్యాలని ఉదయగిరి మండల కన్వీనర్ కొండా రాజగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. నియోజక వర్గ కేంద్రం అయిన ఉదయగిరి పట్టణంలో నియోజకవర్గం ఇన్‌చార్జ్ శ్రీ మేకపాటి రాజగోపాల్ రెడ్డి, యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో అన్ని మండలం నుండి భారీగా ప్రజలు హాజరై ధర్నాను విజయవంతం చెయ్యాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు మండల పరిషత్ సభ్యులు, జడ్పీటీసీలు, సర్పంచులు నూతన కమిటీ సభ్యులు వైఎస్ఆర్సీపీ అనుబంధ సంఘం నాయకులు అభిమానులు కార్యకర్తలు హాజరై ప్రభుత్వంకు మన వ్యతిరేకం వ్యక్తం చేయాలన్నారు. కార్యక్రమంలో మండలం నుండి యువత విద్యావం తులు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టామని రాజగోపాల్ రెడ్డి తెలి పారు. కార్యక్రమంలో మండలంలోని నాయకులు తదితరులు పాల్గోని విజయవంతం చేయాలనీ ఈ సందర్భంగా ఆయన కోరారు.

## రోడ్డు ప్రమాదంలో శానిటరీ కార్యదర్శి మృతి

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ పరిధిలోని 1/4 ద్వారకా నగర్–2 వార్డు సచివాలయంలో వార్డ్ శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న షేక్ ముజాహిద్ అలీ స్థానిక ఎన్టీఆర్ నగర్ హైవే ప్రాంతంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ప్రభుత్వ వైద్యశాల మార్చురీ గదికి కమిషనర్ వై.ఓ నందన్ ఇతర అధికారులతో కలిసి తరలివెళ్లారు.

## విత్తనశుద్ధి తప్పనిసరిగా పాటించాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పంటల సాగు సమయంలో రైతులు తప్పని సరిగా విత్తనశుద్ధి పాటించాలని మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అప్పసముద్రం, గడినరవ రైతుసేవ కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరినార్లు పోసుకునేందుకు సిద్ధమవుతున్న తరుణంలో వ్యవసాయాధికారులు సూచించిన మందులతో విత్తనశుద్ధి చేపట్టాలన్నారు. విత్తనశుద్ధి వల్ల నాటిన 20రోజుల వరకు తెగుళ్లు సోకవన్నారు. ఈ కార్య క్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది. రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ న్యాయవాది విజయం మృతి



**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది పిఈ విజయం (92) తీవ్ర అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు వీరు గతంలో నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే క్రీడా పోటీలలో ప్రముఖ పాత్ర పోషించారు. వీరు రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్ తదితర క్రీడలలో మంచి నైపుణ్యం కలవారు. ఈయన గతంలో నెల్లూరు ప్రభుత్వ బీఈడీ కాలేజీలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేసి మంచి పేరు సంపాదించారు. కాలేజీలో ఉద్యోగం పదవి విరమణ అనంతరం నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యులుగా చేరి క్రిమినల్ కేసు లు వాదించే న్యాయవాదిగా మంచి పేరు సంపాదించారు. సామాన్య ప్రజలను పోలీసులు వేధించిన సందర్భంలో 30 ఏళ్ల క్రితం వీరు దాఖలు చేసిన పలు కేసులు అప్పట్లో జిల్లాలో పలు సంచనాలు కలిగించాయి. నెల్లూరు నగరం బాలాజీ నగర్‌కు చెందిన దివంగత న్యాయ వాది అంత్యక్రియలు బుధవారం జరుగుతా యని వారి సన్నిహితులు తెలిపారు. వీరి మృతిపట్ల రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ పబ్లిక్ ప్రాసి క్యూటర్ కుడుముల రవి నెల్లూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పులిమి అయ్యప్పరెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జల్లి పద్మాకర్, ఐఏఎల్ జిల్లా అధ్యక్షులు అంకయ్యలు సంతాపాన్ని ప్రకటించారు.

# కార్పొరేషన్‌లో అధికారులతో ఎమ్మెల్యే కోటంరెడ్డి సమీక్ష





**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కొండాయపాలెం, వేదాయపాలెం రైల్వే గేట్ల వద్ద అండర్ బ్రిడ్జిల నిర్మాణం కోసం డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ పీవీ రమణ రావు, మున్సిపల్ కమిషనర్ వైఓ నందన్, ఆర్డీఓ ఎన్.అనూష, మున్సిపల్, రెవెన్యూ, ఎలక్ట్రికల్ శాఖల అధికారులతో కలిసి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మంగళవారం జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ హిమబిందు, ఇంజనీరింగ్, విద్యుత్, రెవెన్యూ శాఖ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# స్విమ్మింగ్ పోటీలలో సత్తా చాటిన నారాయణ విద్యార్థి



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 8 నుంచి 10 వరకు జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 19 స్విమ్మింగ్ పోటీలలో నెల్లూరు స్టోన్ హౌస్‌పేట నారాయణ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి నారపరెడ్డి గణేష్ బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి విద్యార్థి గణేష్‌ను అభినందించారు. మంగళవారం నగరంలోని స్థానిక స్టోన్ హౌస్ పేట నారాయణ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో డీజిఎం మధుసూదన్‌రెడ్డి, కోర్ డీన్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ సుధాకర్ అధ్యాపకులు, అధ్యాపకత సిబ్బంది పాల్గొని గణేష్‌కు పథకాలను బహుకరించి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలియజేశారు. అనంతరం డీజీఎం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. నారాయణ విద్యాసంస్థల జిఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి సూచనల మేరకు దిశ పేరుతో విద్యార్థులకు చదువులతోపాటు వివిధ రకాల క్రీడా పోటీలు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు, అలాగే యోగా వంటి వాటిల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లోకి నారాయణా జూనియర్ కళాశాల స్టోన్ హౌస్ పేట బ్రాంచ్‌కి చెందిన విద్యార్థి గణేష్ 50 మీటర్లు 100 మీటర్లు 200 మీటర్ల స్విమ్మింగ్ పోటీలలో పాల్గొని విజేతగా నిలిచి గోల్డ్ మెడల్ సాధించడం జరిగిందన్నారు. కోర్ డీన్ శ్రీనివాసులు మాట్లాడుతూ నారాయణ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు వారు ఆసక్తి కనపరిచిన రంగాలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. తద్వారా వారిలో దాగివున్న ప్రతిభను వెలికి తీసి ఆయా రంగాలలో మంచి ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నామన్నారు. తమ కళాశాలకు చెందిన విద్యార్థి గణేష్ స్విమ్మింగ్ పోటీలలో పాల్గొని నెల్లూరు జిల్లా ప్రతిభను రాష్ట్ర స్థాయిలో చాటి చెప్పడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్ అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో విస్తృత తనిఖీలు

● ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం ● స్వయంగా తనిఖీలను పరిశీలిస్తున్న ఎస్పీ








**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందుకు చర్యల్లో భాగంగా జిల్లా ఎస్పీ అజితా వేజెండ్ల జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ప్రజాశాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా జిల్లా వ్యాప్తంగా సోమవారం సాయంత్రం నుండి జిల్లావ్యాప్తంగా పోలీసు అధికారులు రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు, జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా నెల్లూరు నగరం ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, మాల్స్, సినిమా హాల్లో, వివిధ పార్కింగ్ ప్రదేశాలు, రామలింగాపురం బ్రిడ్జ్, ప్రధాన కూడళ్లు, ప్రధాన జాతీయ రహదారులు తదితర ప్రాంతాలు జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించారు. అంతేకాకుండా ప్రయాణికులను వారి లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఎవరైనా వ్యక్తుల కదలికలు అనుమానాస్పదంగా ఉంటే వారిని విచారించాలని తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసు అధికారులకు మరియు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లో పరిధుల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నట్లు, అనుమానాస్పద వ్యక్తులు వస్తువులు ప్రదేశాలను బాంబ్ డిస్పోజల్ టీంలు, పోలీసు జాగిలాల బృందాలతో తనిఖీ చేస్తున్నట్లు ఎస్పీ వివరించారు. డ్రోన్ కెమెరా ద్వారా పరివేక్షణ మరియు సీసీ కెమెరా ఫుటేజ్ పరిశీలన ప్రత్యేక చెక్ పోస్టల ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. అనుమానస్పద వ్యక్తుల చొరబాటును నిరోధించడం, శాంతి భద్రతలకు ముప్పుగా మారే అసాంఘిక శక్తులను గుర్తించడమే లక్ష్యమని, ప్రతి చర్య తమ సామూహిక శాంతి, సురక్షితతను నిర్ధారించడానికి ఉద్దేశించబడింది. రాము అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా ఇలాంటి అవాంఛనీయ ఘటనలను నిరోధించవచ్చని ప్రజల సహకారం ఈ ప్రయత్నాలలో చాలా కీలకమని వారి సహకారం అందించాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కోరారు.

సామాజిక మాధ్యమాలలో నిర్ధారణ లేని వార్తలు వదంతులు పట్టించుకోవద్దని ఎవరైనా అనుమానితులను గుర్తిస్తే వెంటనే డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## శ్రీ రాజరాజేశ్వరి దేవి కాత్యాయని వ్రతం



**నెల్లూరు అర్బన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు దుర్గామిట్టలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అనివెట్టి మండపం నందు ప్రత్యేకంగా ప్రత్యేకపూల అలంకారం చేసి కాత్యాయని వ్రతం చేశారు. ఈ వ్రతం చేయుట వలన వధూవరులకు జాతక రీత్యా కుజ దోషం, కాల సర్పదోషాలు అన్ని తొలగిపోయి ఉత్తమమైన వివాహం జరగును. స్త్రీలు సౌభాగ్యం కొరకు, ఆయురారోగ్యాలు, అన్యోన్య దాంపత్యం కోసం ఈ కాత్యాయని వ్రతంను చేయవచ్చును. ఈ వ్రతం ఆచరించిన యెడల ఉత్తమమైన ఫలితాలు లభించునని అర్చకులు తెలిపారు. కార్యక్రమాలన్నీ ఆలయ సహాయ కమీషనరు, కార్యనిర్వహణా ధికారి పర్యవేక్షణలో జరిగాయి. కావున భక్తులు ప్రతి వారం జరుగు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్ రెడ్డి తెలిపారు.

## వీఆర్ హై స్కూల్‌కు నాలుగు బస్సులు బహుకరణ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ సూచనల మేరకు యూనియన్ బ్యాంక్ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల వినియోగంలో భాగంగా నెల్లూరు నగరపాలక సంస్థకు ఒక కోటి 20లక్షల విలువైన నాలుగు బస్సులను బహూకరించారు. వీఆర్ మున్సిపల్ పాఠశాల మైదానంలో మంగళవారం జరిగిన బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమిషనర్ వైఓ నందన్ హాజరై జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నెల్లూరు నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అదనపు తరగతి గదులకు శంకుస్థాపన



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ స్థానిక ఏసీ నగర్ ప్రాంతంలోని మల్లెల సంజీవయ్య మెమోరియల్ మున్సిపల్ పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు కర్తం ప్రతాప్ రెడ్డి, ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, నెల్లూరు నగరపాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఢిల్లీ పేలుళ్ల మృతులకు బీజేపీ నివాళి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** దేశరాజధాని ఢిల్లీలో జరిగిన పేలుళ్లలో మృతులకు బీజేపీ నేతలు నివాళులు మంగళవారం అర్పించారు. స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వంశిధర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యాకసిరి ఫణిరాజు, నగరఅధ్యక్షులు మండ్ల ఈశ్వరయ్య, రాజేష్ తదీతర నాయకులు పాల్గొన్నారు.